


వైభవంగా చక్రస్నానం

● ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

కడప (కల్చరల్‌) ఫిబ్రవరి 18: దేవునికడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం కోలాహలం నడుమ వసంతోత్సవం నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిసి శ్రీనివాసుడు చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా పుష్కరిణి వద్ద సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం శ్రీవారి చక్రానికి పుష్కరిణిలో ఆలయ ప్రధాన అర్చకులు త్రివిక్రమ్‌, క్రిష్ణమోహన్‌ భక్తిశ్రద్ధలతో చక్రస్నానం గావించారు. కార్యక్రమానికి భక్తులు విరివిగా హాజరై పుష్కరిణిలో స్నానమాచరించారు. ఉత్సవాల ముగింపులో భాగంగా రాత్రి ఆలయంలో ధ్వజావరోహణం గావించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా లక్ష్మీ వేంకటేశ్వరుడు వీణాధరునిగా హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.



కలహాల కాపురం



● పులివెందుల సహా.. వైసీపీలో కోల్డ్‌వార్‌
● కడుపులో కత్తులు.. పైకి కౌగిలింతలు
● సర్ది చెప్పలేని స్థితిలో జగన్‌ శిబిరం
● వైనాట్‌ 175.. జగన్‌ నినాదం
● వచ్చే ఎన్నికల్లో సాధ్యమేనా..

(కడప - ఆంధ్రజ్యోతి): వైనాట్‌.. 175 సీట్లు గెలవాలంటే ప్రతి నియోజకవర్గం వన్‌సైడ్‌ అయిపోవాలన్నమాట. మరి సీఎం జగన్‌ సొంత జిల్లాలోనే ప్రతి నియోజకవర్గంలో వైసీపీలో కుంపట్లు రగులుతున్నాయి. ఒకరంటే ఒకరు పడని విధంగా ఆధిపత్యం కోసం లోలోపల రగిలిపోతున్నారు. కడుపులో కత్తులు పెట్టుకుని పైకి కౌగిలింతలు అన్నట్లు కడప జిల్లాలో వైసీపీ నేతల తీరు ఉంది. జగన్‌ వైసీపీ స్థాపించిన తరువాత అందరూ కలిసికట్టుగా పనిచేశారు. అయితే జగన్‌ సీఎం అయిన తరువాత 2019 నుంచి 2024 మధ్య ప్రతి నియోజకవర్గంలో సంపాదన, పవర్‌ కోసం గ్రూపులుగా విడిపోయారంటారు. ఈ గ్రూపుల గోల కేవలం ఏదో ఒక నియోజకవర్గానికి పరిమితం కాలేదు సీఎం సొంత నియోజకవర్గం సహా అన్నింటిలో వైసీపీలో కోల్డ్‌వార్‌ జరుగుతుండడం గమనార్హం.

పులివెందులలో తొలి బీజం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి బతికి ఉన్నంత వరకు వైఎస్‌ కుటుంబం ఏకతాటిపై ఉండేది. రాజశేఖర్‌రెడ్డి అధికారంలో లేనప్పుడు కూడా కుటుంబం అంతా ఆయనవైపే ఉండేది. అదే విధంగా ఆ నియోజకవర్గం అండగా ఉంటూ వచ్చేది. రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆ కుటుంబంలో విబేధాలు వచ్చాయి. కాంగ్రెస్‌ను జగన్‌ వీడి వైసీపీని స్థాపించారు. 2011లో కడప పార్లమెంటు, పులివెందుల అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో కడప నుంచి జగన్‌, పులివెందుల నుంచి ఆయన తల్లి విజయమ్మ పోటీ చేశారు. అయితే మొదటిసారిగా ఆ కుటుంబంలో విబేధాలు బయటికి వచ్చాయి. విజయమ్మపై దివంగత మాజీ మంత్రి వైఎస్‌ వివేకా పోటీ చేశారు. దీంతో వైఎస్‌ వివేకా కుటుంబం జగన్‌రెడ్డికి దూరమైంది. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో వైఎస్‌ వివేకానంద రెడ్డి వైసీపీలో చేరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయగా బీటెక్‌ రవి చేతిలో ఓటమి చెందారు. జగన్‌ సీఎం లక్ష్యంగా వివేకా జిల్లాలో విస్తృతంగా పర్యటించారు.

వివేక హత్య తరువాత...

2019 మార్చి 15న వివేకానందరెడ్డి దారుణ హత్యకు గురయ్యాడు. వివేకా హత్య తరువాత పులివెందుల కలగూరగంపలా తయారయిందంటారు. ఎంపీ అవినాష్‌రెడ్డి, వైఎస్‌ వివే కానందరెడ్డి వర్గంలా విడిపోయారంటారు. అయితే పవర్‌ ఉండడంతో పైకి చెప్పుకోలేని పరిస్థితి ఉందంటారు. వివేకా హత్య కేసులో సీబీఐ విచారణ తరువాత ఎంపీ అవినాష్‌రెడ్డి ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిలను దోషులుగా చేర్చింది. ఈ కేసుతో జగన్‌రెడ్డికి, వివే కానందరెడ్డి కుమార్తె సునీతకు సంబంధాలు బాగా చెడిపోయాయి. తండ్రినే హత్య చేసిన వారిని అన్న జగన్‌ కాపాడుతున్నాడనే కోపం సునీతరెడ్డిలో ఉంది. ఈ గ్యాప్‌ బాగా పెరిగింది. ఇప్పుడు జగన్‌కు సొంత చెల్లి షర్మిల కూడా దూరమైంది. వీరి మధ్య ఆస్తి వివాదాలు నడుస్తున్నాయంటారు. ఇప్పుడు ఆమె కాంగ్రెస్‌లో చేరి ప్రతిపక్ష నేత హోదాలో జగన్‌ పాలనను దుమ్మెత్తి పోస్తోంది. జగనన్న ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడప స్టీలు ఇతరత్రా హామీల కోసం కేంద్రం మెడలు వంచి పోరాడాలని తనదైన స్టైల్‌లో అటాక్‌ చేస్తుంది. ఇలా సీఎం జగన్‌ సొంత కుటుంబంలోనే కలహాల కాపురాన్ని చక్కబెట్టలేక పోవడంతో మిగతా చోట్ల షరా మామూలుగానే మారింది.

● కమలాపురంలో ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఆర్టీసీ చైర్మన్‌ మల్లిఖార్జునరెడ్డిల మధ్య కోల్డ్‌ వార్‌ నడుస్తోంది. చాలా రోజులు ఎడముఖం పెడముఖంగా ఉన్నారు. అయితే ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఇటీవలే ఇరువురూ కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మల్లిఖార్జునరెడ్డి కమలాపురం నుంచి పోటీ చేయాలని ఎప్పటి నుంచో ఆసక్తి కనబ రుస్తున్నట్లు చెబుతారు. దీంతో ఆధిపత్యం కోసం ఎమ్మెల్యే, ఆర్టీసీ ఛైర్మన్‌ మధ్య కోల్డ్‌వార్‌ నడుస్తున్నట్లు చెబుతారు.

● కడప టికెట్‌పై మేయర్‌ సురేష్‌బాబుతో పాటు కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాదరెడ్డి ఎప్పటి నుంచో కన్నేశారు. అయితే కొన్ని పరిస్థితుల కారణంగా రవీంద్రనాదరెడ్డి కమలాపురం నుంచి పోటీ చేశారంటారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా రెండు పర్యా యాలుగా గెలుపొందారు. ఎప్పటి నుంచో కడప సీటుపై మేయర్‌ సురేష్‌బాబు కన్నేశారు. అయితే ఆయనను మేయరుగా సరిపెట్టారు. ఇక్కడ కూడా టికెట్‌ కోసం వార్‌ సాగుతుంది.

● బద్వేలు ఒకప్పుడు బిజివేముల వీరారెడ్డి కుటుంబానికి అడ్డా. వైఎస్‌ కుటుంబానికి పులివెందుల ఎలాగో టీడీపీకి బద్వేలు అలాంటిది. అయితే వీరారెడ్డి మరణానంతరం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి రాజకీయప్రవేశం చేయడంతో వన్‌సైడ్‌ అయ్యింది. 2004 ఎన్నికల్లో గోవిందరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి నుంచి కాంగ్రెస్‌ బాధ్యతలు చూస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. వరుసగా వైసీపీని గెలిపిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆయన తమ్ముడు కాశినాయన జడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి బావమరిది మాజీ ఎంపీపీ విశ్వనాధరెడ్డి నుంచి పవర్‌ కోసం పోరు మొదలైంది. ఎమ్మెల్సీకి వ్యతిరేకంగా కలసపాడు, కాశినాయన, బికోడూరు, పోరుమామిళ్లకు చెందిన తన వర్గీయులతో విశ్వనా థరెడ్డి సమావేశాలు ఏర్పాటు చేశారు. ఎంపీ అవినాష్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబుల ద్వారా తనకున్న పరిచయాలతో విశ్వనాథరెడ్డి నియోజకవర్గ అదనపు సమన్వయ కర్తగా వ్యవహరించడాన్ని జీర్ణించుకోలేకున్నారు. రెండురోజుల క్రితం పోరుమామిళ్లకు చెందిన ఎమ్మెల్సీ వ్యతిరేకుల సమావేశానికి ఎంపీ అవినాష్‌రెడ్డి, సురేష్‌బాబు హాజరయ్యారు. ఇక్కడున్న పరిస్థితిని చూస్తే ఒకరిపై ఒకరు నమ్మకం లేని పరిస్థితి ఉందంటారు.

● జమ్మలమడుగులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిల మధ్య వర్గపోరు నడుస్తోంది. ఇరువురి మధ్య సురేష్‌బాబు పంచాయతీ చేసినా కూడా గ్రౌండ్‌ లెవల్‌లో కలవని పరిస్థితి ఉందంటారు.

● మైదుకూరులో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జగన్‌ బంధువు దువ్వూరుకు చెందిన ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డిల మధ్య కోల్డ్‌వార్‌ నడుస్తూనే ఉంది. ఆధిపత్యం కోసం తీవ్రస్థాయిలో నడుస్తున్నారు.

● ప్రొద్దుటూరులో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు శివచంద్రారెడ్డి, పలువురు కౌన్సిలర్లు గళమెత్తి నిరసన బాట పట్టారు. ఎమ్మెల్యే రాచమల్లుకు వ్యతిరేకంగా ప్రచారాన్ని చేపట్టారు. ఇలా నియోజకవర్గంలోని ప్రతి చోటా వైసీపీ గ్రూపులున్నాయి. జగన్‌ సొంత కుటుంబంలోనే ఏర్పడిన కలహాల కారణంగా మిగతా నియోజకవర్గంలో ఉన్న గ్రూపులను సర్దుకోవాలని హెచ్చరించే పరిస్థితి లేదని విమర్శ ఉంది.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

● ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి



గాయపడిన ఫొటోగ్రాఫర్‌ కృష్ణ

కడప (ఎడ్యుకేషన్‌), ఫిబ్రవరి 18: అనంతపుర జిల్లా రాప్తాడు వద్ద సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌ క్రిష్ణపై జరిగిన దాడి అమానుషం అని.. ప్రజలందరూ ఖండించాల్సిన అవసరం ఉందని.. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి హానికరమని ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, వీడియో అండ్‌ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్‌ అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఎన్నికల వాతావరణంలో జర్నలిస్టులు తమవృత్తిని సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ కార్యకర్తల దాడి నీతిమాలిన చర్య అని ఏపీజేఎఫ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి శ్రీనాథరెడ్డి మండిపడ్డారు. న్యూస్‌ కవరేజీలో ఉన్న ఫొటో జర్నలిస్టుపై పైశాచికంగా దాడి చేయడం చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేదా ఆటవిక రాజ్యంలో ఉన్నామా అన్న ఆందోళన కలుగుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ చాలా ముఖ్యమని, ఇప్పుడు ఏపీలో భావ ప్రకటన స్వేచ్ఛ కనమరుగవుతోందన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దుర్మార్గ చర్య

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై విచక్షణా రహితంగా దాడి చేయడం దుర్మార్గ చర్య అని టీడీపీ జిల్లా మీడియా కోఆర్డినేటరు చెప్పలి జనార్ధన్‌ తెలిపారు. దాడికి పాల్పడిన వైసీపీ అల్లరి మూకలపై క్రిమినల్‌ కేసులు నమోదు చేయాలని డిమాండ్‌ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో మీడియాకు రక్షణ కరువైందన్నారు.

నీచమైన చర్య

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి నీచమైన చర్య అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్‌ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. విధి నిర్వహణలో భాగంగా రాప్తాడు సిద్ధం సమావేశంలో ఫొటోలు తీస్తుండగా వైసీపీ దుర్మార్గులు దాడి చేయడం దారుణమన్నారు.

ఏపీలో బీసీలు ముఖ్యమంత్రి
అయ్యేదెప్పుడు!

● రాయితీలు కాదు రాజ్యాధికారం దిశగా బీసీలు పోరాడాలి
● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు
జాజుల శ్రీనివాసగౌడ్‌

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 18 : స్వాతంత్ర్యం వచ్చాక 15 సార్లు శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఏపీలో బీసీలు ఒక్కరు కూడా ముఖ్యమంత్రి కాలేదని.. 136 కులాలు, 60 శాతం జనాభా వున్న బీసీలు రాయితీలను కాదని రాజ్యాధికారం దిశగా పోరాటం సాగించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస గౌడ్‌ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రొద్దుటూరులోని టీటీడీ కల్యాణమండపంలో బీసీ ప్రజాచైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో బీసీల ఆత్మగౌరవసభ నిర్వహించారు. అంతకుముందు ఆర్టీసీ బస్టాండ్‌ వద్ద గల మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహానికి బీసీ నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి టీటీడీ కల్యాణ మండపం వరకు ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా శ్రీనివాసగౌడ్‌ మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో ఇప్పటివరకు 26 మంది ముఖ్యమంత్రులైతే.. అందులో రెడ్లు 13 మంది, కమ్మలు ఆరుగురు, బ్రాహ్మణులు ముగ్గురు, వెలమలు ముగ్గురు, వైశ్యులు ఇద్దరు, దళితులు ఒక్కరు పాలించారన్నారు. కానీ ఒక్క బీసీ కూడా లేక పోవడం విచారకరమన్నారు. రెండు, మూడు శాతం జనాభా వున్న కులాల ప్రతినిధులు ముఖ్యమంతులు అవుతుంటే 60 శాతం జనాభా వున్న వారు ఎందుకు రాజ్యాధికా రం చేజిక్కించుకోలేకపోయామో ఆలోచించాలన్నారు. రాయలసీమంటే రెడ్ల సామ్రాజ్యమ ని ఇక్కడ వారి ఆధిపత్యానికి బీసీలు పాతరవేసినప్పుడే ఎమ్మెల్యేలు, ఎంపీలు కాగలమన్నారు. రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాల్లో 90, 25 ఎంపీ స్థానాల్లో 12 బీసీలకు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. అదే విధంగా కడప జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలుంటే నాలుగు బీసీలకు ఇవ్వాలన్నారు. సెంట్రల్‌ యూనివర్శిటీ ప్రొఫెసర్‌ వెంకటేష్‌ మాట్లాడుతూ 1955 నుంచి 2019 వరకు జరిగిన ఎన్నికల వరకు బీసీలు 33 శాతం మేర రాజకీయంగా తీవ్రం గా నష్టపోయారన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కేటాయించినా.. మహిళా రిజర్వేషన్‌ బిల్లులో ఓబీసీ కోటా పెట్టకున్న వైసీపీ, టీడీపీ, బీజేపీ పార్టీలలోని బీసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రశ్నించకపోవడం బీసీ జాతికి తీరని ద్రోహం చేయడమేనన్నారు. సీనియర్‌ న్యాయవాది గొర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు అవినీతి, భూదందాలను ప్రశ్నించినందుకు పట్టపగలే టీడీపీ అధికార ప్రతినిధి, బీసీనేత నందం సుబ్బయ్యను కిరాతకంగా నరికి చంపారన్నారు. అలాంటి ఎమ్మెల్యేకు జగన్‌ మళ్లీ సీటు ఇచ్చి ప్రొద్దుటూరు బీసీలకు ఏం సందేశం ఇవ్వదలచుకున్నాడో తెలపాలన్నారు. ఏ పార్టీలు బీసీలకు టిక్కెట్లు ఇవ్వకుంటే కులానికి 10 మంది చొప్పున బీసీ కులాల వారంతా నామినేషన్లు వేసి మన నిరసన తెలియజేయాలన్నారు. డాక్టర్‌ మల్లెల భాస్కర్‌ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 50 లక్షల కోట్ల మేర గనులు తవ్వకుంది కేవలం రెండు కులాల వారేనన్నారు. ప్రతి ఏడాది భారత ప్రభుత్వానికి రూ.18 లక్షల కోట్లు బీసీలు పన్నుల రూపంలో చెల్లిస్తున్నారని.. బీసీ, ఎస్సీలకు పథకాలన్నీ ఇచ్చి బడ్జెట్‌ అంతా ఖర్చు పెడుతున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ ప్రజాచైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు,బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, చెన్నా సరళాదేవి, వైసీపీ ఎమ్మెల్సీ రమేష్‌ యాదవ్‌, చల్లా రాజగోపాల్‌ యాదవ్‌, భాస్కరరావులతో పాటు రాయలసీమ జిల్లాల బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్న బీసీలు

జగన్‌రెడ్డి ఆటలిక సాగవు

● టీడీపీ అధికారంలోకి రాగానే 20 లక్షల ఉద్యోగావకాశాలు
● నిరుద్యోగులతో ముఖాముఖి కార్యక్రమంలో టీడీపీ నేతలు

కడప (మారుతీనగర్‌) ఫిబ్రవరి 18: నిరుద్యోగుల జీవితాలతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సాగించిన ఆటలిక సాగవని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్‌.శ్రీనివాసరెడ్డి, కడప అసెంబ్లీ ఇన్‌చార్జ్‌ ఆర్‌.మాధవీరెడ్డి ధ్వజమెత్తారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా వైసీపీ సర్కార్‌పై నిరుద్యోగులు పెట్టుకున్న ఆశలపై జగన్‌రెడ్డి నీళ్లు చల్లారన్నారు. ఆదివారం స్థానిక హరిత హోటల్‌ సమావేశ మందిరంలో నిరుద్యోగుల ప్రశ్నలకు వైసీపీ ప్రభుత్వం సిద్ధమా... ఓ నిరుద్యోగి కదలిరా.. అనే కార్యక్రమాన్ని నిరుద్యోగులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా జనవరిలో జాబ్‌ క్యాలెండర్‌ విడుదల చేస్తామని ఎన్నికల ముందు జగన్‌రెడ్డి నిరుద్యోగులకు ఆశచూపి తూతూ మంత్రంగా సచివాలయ, వాలంటీర్ల ఉద్యోగాలిచ్చి గొప్పలు చెప్పుకోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి సర్కార్‌ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ నాయకులంతా వనరులను దోచుకోవడం దాచుకోవడంపైనే దృష్టిసారించారే తప్ప నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ధ్యాసే లేదన్నారు. దీంతో నిరుద్యోగులంతా ముక్త కంఠంతో జగన్‌రెడ్డి సర్కార్‌ను సాగనంపేందుకు సిద్ధంగా వున్నారన్నారు. ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించి నాలుగున్నర సంవత్సరాలు కిమ్మనకుండా వుండి తీరా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డీఎస్సీ అంటూ దగా చేసేందుకు మరో కొత్త మోసానికి తెరతీయడం దారుణమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కాగా, తమ జీవితాలలో చెలగాటమాడిన వైసీపీ సర్కార్‌కు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని కొందరు నిరుద్యోగులు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్‌ నేత గోవర్ధన్‌రెడ్డి, జిలానీ బాషా ఆర్‌ఎస్‌ఏ నాయకులు రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి మాధవీరెడ్డి, చిత్రంలో శ్రీనివాసరెడ్డి

సిద్ధం..జనానికి నరకం

● జగన్‌ సభకు బస్సులు ● ప్రయాణికులకు తిప్పలు ● బస్సుల్లేక నిర్మానుష్యంగా బస్టాండ్లు ● పెళ్లిళ్ల వేళ అవస్థలు

సీఎం జగన్‌ అండ్‌ కోకు జనం అంటే బాగా అలుసైనట్లు ఉంది. మేము ఇచ్చే నవరత్నాలు పథకాలను పంచభక్ష పరమాన్నంగా భావిస్తున్నారని జనం అనుకుంటున్నట్లు ఉన్నారు.. మేము ఏం చేసిన జనం నోరు విప్పరనే ధైర్యంతో ఉన్నారు. జనం కూడా వారి ఆగడాలను ప్రశ్నించే ధైర్యం లేక వదిలేస్తున్నారు. దీన్ని అలు సుగా తీసుకుని జగన్‌ అండ్‌ కో రెచ్చిపోతోంది. ఎవరైనా ఎదురు తిరిగితే వలంటీర్ల ద్వారా పథకాలను కట్‌ చేస్తామనే బెదిరింపు అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు.



కడప ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల రాక కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

కడప, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనంత పురం జిల్లాలోని రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు కడప జిల్లా నుంచి స్కూల్‌ వ్యాన్లు, కార్లు, ఇతర వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులను పెద్దఎత్తున తీసుకెళ్లారు. దీంతో ఆదివారం, పెళ్లిళ్ల ఇతర శుభకార్యాల కోసం వెళ్లలేక సీఎం జిల్లా వాసులు నరకం అనుభవించారు. వంద రూపాయలు చార్జీలతో వెళ్లే ప్రయాణానికి రూ.500 పెట్టుకొని వెళ్లిరావాల్సిన దౌర్భాగ్యస్థితి నెలకొంది. రాప్తాడులో జరిగే జగన్‌ సిద్ధం సభను జగన్‌ అండ్‌ కో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. భారీ జనసమీకరణ టార్గెట్‌గా పెట్టుకుంది. అందుకే సీఎం సొంత జిల్లా నుంచి జనసమీకరణ చేశారు. ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం పదివేలకు తగ్గకుండా తీసుకెళ్లాలని నిర్ణయించారు. తాడేపల్లె ప్యాలెస్‌ నుంచి రవాణాశాఖ అధికారులకు ఆదేశాలు రావడంతో జిల్లాలో ఉన్న ప్రైవేట్‌ స్కూళ్లకు చెందిన 500 బస్సులను సిద్ధం సభకు తీసుకెళ్లారని చెబుతారు. వీటితో పాటు ఆర్టీఓల ద్వారా మినీ బస్సులు, ఇతర వాహనాలను బెదిరించి అనంతపురం తీసుకెళ్లారని చెబుతారు. ప్రైవేట్‌ స్కూళ్ల బస్సులకు అయితే డ్రైవర్‌కు భోజనం మాత్రమే తెప్పించారు. ఇక జిల్లాలో 570 ఆర్టీసీ బస్సులు ఉండగా డిపోల వారీగా సగం బస్సులను సిద్ధం సభకు తీసుకెళ్లారు.

జనం అవస్థలు వర్ణనాతీతం

జిల్లా వ్యాప్తంగా ఆదివారం భారీ సంఖ్యలో పెళ్లిళ్ల, ఇతర శుభకార్యాలు జరిగాయి. ముందుగానే నిర్ణయించుకున్న ముహూర్తాలు కావడంతో బంధువులు, కుటుంబ సభ్యులు పెళ్లిళ్లకు సిద్ధమయ్యారు. అయితే అనంతపురం జగన్‌ సిద్ధం సభకు బస్సులను కడప నుంచి అనంతపురానికి తరలించారు. దీంతో పెళ్లిళ్ల, ఇతర శుభకార్యాలకు వెళ్లలేక జనం నానా అవస్థలు పడ్డారు. వీకెండ్‌ కావడంతో బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్‌ ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్‌ ఇతరత్రా ఉద్యోగాలు చేసే వారు కొందరు శనివారం రాత్రి బయలుదేరి ఆదివారం ఉదయానికి కడపకు చేరుకున్నారు. వాళ్ల తమ సొంత ఊళ్లకు బస్సుల్లో వెళ్లాల్సి ఉంది. అయితే సిద్ధం సభకు బస్సులు వెళ్లిపోవడంతో తీవ్ర అవస్థలు పడ్డారు.

కడప జిల్లా నుంచి రోజు 570 బస్సులు సరాసరిన 2.35 లక్షల కిలోమీటర్ల మేర తిరుగుతుంటాయి. సుమారు 1.50 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తుంటాయి. కడప ఆర్టీసీ పరిధిలో 126 బస్సులు ఉండగా ఇందులో 50 బస్సులను సిద్ధం సభకు పంపించేశారు. మైదుకూరులో 80 బస్సులు ఉంటే 40 బస్సులు, ప్రొద్దుటూరులో 147 ఉంటే 80, జమ్మలమడుగులో 77 బస్సులు ఉంటే 42, పులివెందులలో 122 ఉంటే 69 బస్సులను సిద్ధం సభలకు పంపించేశారు. దీంతో సాఫ్ట్‌వేర్‌, ఇతర ఉద్యోగులు, పెళ్లిళ్ల ఇతర కార్యక్రమాలకు వచ్చిన వారికి బస్సులు లేక నానా అగచాట్లుపడ్డారు.

జన సమీకరణకు నానా అగచాట్లు

రాప్తాడు బహిరంగ సభను భారీ జనసమీకరణతో తరలించేందుకు వైసీపీ నానా అగచాట్లు పడింది. పది రోజుల నుంచి జనసమీకరణకు స్కెచ్‌ వేసింది. నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేశారు. గ్రామ, మండలస్థాయి, వార్డు, డివిజన్‌ స్థాయిలో జనసమీకరణకు టార్గెట్‌ పెట్టుకున్నారు. అధికారం చేతిలో ఉండడంతో అధికారుల ద్వారా ప్రైవేట్‌ బస్సులు, ఇతర వాహనాలను, ఆర్టీసీ బస్సులను ఉపయోగించుకుంది. దారి ఖర్చుల కోసం దూరాన్ని బట్టి రూ.10 నుంచి రూ.20వేలు ఇచ్చినట్లు చెబుతున్నారు. బస్సులో వెళ్లిన వారి కోసం వాటర్‌, క్వార్టర్‌, ఇతరత్రా ఖర్చుల కోసం ఈ డబ్బును వెచ్చించిట్లు చెబుతారు. ఒక్కో నియోజకవర్గం నుంచి వాలంటీర్లు, డ్వాక్రా మహిళలు, ఇతరత్రా పథకాల లబ్ధిదారులను తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. వాలంటీర్లు, వైసీపీ నేతలు రాప్తాడకు తరలించినట్లు చెబుతారు. కడప, కమలాపురం నుంచి వెళ్లిన కొన్ని ఆర్టీసీ బస్సుల్లో కనీసం 20 మంది లేకుండా బస్సులో వెళ్లినట్లు చెబుతారు.



నిర్మానుష్యంగా కడప బస్టాండ్‌

మద్యం దుకాణాలు కళకళ

వైసీపీ రాప్తాడు బహిరంగ సభను చాలా ప్రతిష్టాత్మంగా తీసుకుంది. ఖర్చుకు వెనుకాడకుండా ఎంతైనా ఖర్చుచేసింది. జన సమీకరణ కోసం బస్సులు, ఇతరత్రా వాటిని సమకూర్చిన వైసీపీ నేతలు మందుబాబుల కోసం మధ్యాహ్నామే మద్యం తెచ్చినట్లు చెబుతారు. కొందరు ముందుగానే మద్యం షాపుల్లో తెచ్చుకున్నట్లు చెబుతారు. పులివెందుల నుంచి వెళ్లిన బస్సులు బ్రాందిషాపుల వద్దకెళ్లి లిక్కర్‌ తీసుకెళ్లడంతో షాపులు కళకళలాడాయి.



అరకొర బస్సుల కోసం ప్రయాణికుల అగచాట్లు



పులివెందులలో మూడు గంటలు ఎదురుచూసిన తర్వాత వచ్చిన బస్సులో సీట్ల కోసం ఎగబడుతున్న ప్రయాణికులు



పులివెందులలో సిద్ధం సభకు వెళ్లే కార్యకర్తలతో కళకళలాడుతున్న మద్యం దుకాణం

విద్యార్థులకు కృషి, పట్టుదల అవసరం

జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

వల్లూరు, ఫిబ్రవరి 18 : లక్ష్య సాధనకు విద్యార్థులకు కృషి పట్టుదల ఎంతో అవసరమని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వల్లూరు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ప్రభాకర్‌రెడ్డి, జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంటు అధికారి విజయలక్ష్మి సందర్శించారు. విద్యార్థులతో మమేకమై స్ఫూర్తిదాయకమైన ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ నేటి ఓటమిని రేపటి విజయానికి నాందిగా భావించి సమాజంలో ఎదురయ్యే సమస్యలు, అవమానాలను పాజిటివ్ దృక్పథంతో ఎదుర్కోవాలన్నారు. జిల్లా గర్ల్ చైల్డ్ డెవల్‌మెంటు అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ అమ్మాయిలు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి చదువు, సంస్కారం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రధానోపాధ్యాయురాలు నాజీమున్నీసా, ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై పాలకుల అలసత్వం బాధాకరం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 18 : దివ్యాంగుల పట్ల ప్రభుత్వాలు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్న తీరు బాధాకరంగా ఉందని భారత్ దివ్యాంగ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఎం.వెంకటరామరాజు అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 లక్షలకు పైగా దివ్యాంగులున్నారని, వీరి హక్కులు, సంక్షేమం, రక్షణ గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా దివ్యాంగుల ఆత్మగౌరవం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా భారత్ దివ్యాంగ్ పార్టీ ఆవిర్భావం జరిగిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా గతంలో తమ ఓట్లతో గద్దెనెక్కిన పాలకులు తమ సమస్యలను ఏమాత్రం ఖాతరు చేయకుండా వారి సొంత ఆస్తుల పెంపుదల కోసం పాకులాడారే తప్ప తమకంటూ చేసిందేమీ లేదన్నారు. చాలామంది దివ్యాంగులు పెన్షన్ డబ్బులతో కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతరులకు ఎలాంటి హాని తలపెట్టలేని దివ్యాంగుల పట్ల పాలకులు చిన్నచూపు చూడడం దారుణమన్నారు. కావున దివ్యాంగులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు తమకు మద్దతివ్వాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. బీడీపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా కె.సుబ్బరామయ్య, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, సహాయ కార్యదర్శిగా షాకీర్, జాషువ, ట్రెజరర్‌గా నరాల శివశంకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఖాదర్‌ఖాన్, పి.రాజన్న, మారుతి, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీడీపీ సీనియర్ నాయకులు సుబ్బనరసారెడ్డి, అబ్దుల్‌ఖాదర్, ఖాదర్‌బాష, వెంకటప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 3వ తేదీ ఆదివారం పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమంలో పాల్గొననున్న 4,961 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లా వ్యాప్తంగా 5 సంవత్సరాలలోపు పిల్లలు లక్ష 93 వేల 946 మందిని నమోదు చేసి వారందరికీ పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1602 పోలియో చుక్కల కేంద్రాలు, 207 రూట్‌లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే బస్టాండు, రైల్వేస్టేషన్‌లలో 45 పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఇటుక బట్టీల దగ్గర, భవనాల నిర్మాణం జరిగే చోట, మురికివాడల్లో నివసించే చోట, ఫ్లైఓవర్‌ల కింద నివసించే చోట, రహదారి పనులు జరిగే చోట, సంచార జాతుల వారు, చేపలు పట్టు వారు, సంతల్లో, వ్యవసాయ పొలాల్లో పనులు చేసుకునే చోట, రాళ్లు, బండలు కొట్టే చోట నివాసం ఉండే ప్రాంతాలను 181 గుర్తించామని, ఇక్కడ నివాసం ఉండే వారి పిల్లలకు పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఒకవేళ మార్చి 3వ తేదీ పోలియో చుక్కలు వేసుకోకుండా తప్పిపోయిన పిల్లలకు మార్చి 4, 5 తేదీల్లో బూత్ పరిధిలో నలుగురు సిబ్బంది, రెండు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటికి వెళ్లి విచారించి బిడ్డలకు పోలియో చుక్కలు వేసి వారి ఇంటిపైన మార్కింగ్ చేస్తారని తెలిపారు. పోలియో కార్యక్రమానికి అనుబంధ శాఖలైన విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, పంచాయతీరాజ్, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు జాతీయ సామూహిక పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొని పోలియో రహిత సమాజ స్థాపన లక్ష్యాన్ని సాధించడానికి భాగస్వాములు కావాలని డీఎంహెచ్‌వో పిలుపునిచ్చారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 18: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 19వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులకు సంబంధించి గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కానీ అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రావాలని తెలిపారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, ఫిబ్రవరి 18:సంతానలక్ష్మీగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అమ్మవారు సంతాన లక్ష్మీ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధికంగా వచ్చి ఆలయంలో సంతానం కోసం వరపడ్డారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పైన పటారం.. లోన లొటారం...

- పైకి ఏపుగా పెరిగిన కట్టె.. ఊడలు దిగని వైనం
- తెగుళ్లతో తగ్గిన వేరుశనగ పంట దిగుబడి
- తీవ్రంగా నష్టపోనున్న రైతులు
- నష్టపరిహారం అందించాలని రైతుల విజ్ఞప్తి


పేరంపల్లెలో సాగుచేసిన వేరుశనగ పంట

గాలివీడు, ఫిబ్రవరి 18: మండలంలో ప్రజలకు ప్రధాన ఆదాయ వనరు వేరుశనగ. ఆ పంటపై మూడొంతుల మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. ఒకప్పుడు రైతు రారాజుగా పేరు పొందిన వేరుశనగ నేడు అదే రైతుకు శాపంగా మారుతోంది. లక్షలు ఖర్చు చేసి సాగు చేసిన పంట తెగుళ్లతో రైతులను భిక్షాధికారిగా మారుస్తోంది. పంట చూస్తే ఏపుగా పచ్చగా ఉన్నా లోపల కాయలు మాత్రం రావడం లేదు. కాయల దిగుబడి తగ్గడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. చేసేది ఏమీలేక రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లలో వేరుశనగను సాగు చేయడం రైతులకు ఆనవాయితీ. కానీ 10 సంవత్సరాలుగా ఖరీఫ్ సీజన్ కంటే రబీ సీజన్‌లోనే వేరుశనగను రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో తుఫానుల వల్ల పంట దెబ్బతింటున్నదని భావించి రబీ సీజన్‌లో సాగు చేస్తున్నారు. గత కొంతకాలంగా రబీ సీజన్‌లో పంట దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం వచ్చేది. కానీ రెండు సంవత్సరాలుగా రబీ సీజన్‌లో కూడా దిగుబడి తగ్గి రైతులు నష్టాలు పాలవుతున్నారు. మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో 6 వేల ఎకరాలకు పైగా రబీ సీజన్‌లో వేరుశనగను సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఈ సీజన్‌లో ముఖ్యంగా సాధారణ రకంతో పాటు మరో ఐదు కంపెనీలకు చెందిన కాయలను సాగు చేశారు. ముఖ్యంగా నూలివీడు, చీమలచెరువుపల్లె, గుండ్లచెరువు, గోపనపల్లె, పేరంపల్లె, గోరాన్‌చెరువు, ఎగువగొట్టివీడు, అరవీడు, గాలివీడు, వెలిగల్లు, తూముకుంట, గరుగుపల్లె, పందికుంట, కొర్లకుంట, తలముడిపి, పూలుకుంట తదితర గ్రామాల రైతులు వేరుశనగను ఎక్కువగా సాగు చేశారు.


నూలివీడులో కాయలు లేక దిగుబడి తగ్గిన వేరుశనగ

ఖర్చు ఎక్కువ.. దిగుబడి తక్కువ...

ఒక ఎకరా వేరుశనగ పంటను సాగు చేయడానికి 20 వేల రూపాయలకు పైబడి ఖర్చు అవుతున్నదని రైతులు తెలిపారు. ఇందులో విత్తనకాయలు 42 కేజీల బస్తా 3 వేలకు పైబడి ధర పెట్టి కొనుగోలు చేస్తున్నామని దుక్కులు, ఎరువులు, కూలి వంటి రేట్లు అధికమవుతాయని చెబుతున్నారు. ప్రస్తుతం గింజ మొలక విత్తేనాటి నుంచి చెట్లను తొలగించే వరకు అనేక రకాల తెగుళ్లు సోకుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో పంట సాగు కాలం అంతా ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే తెగుళ్లకు మందులు పిచికారి చేసేవాళ్లమని కానీ నేడు నెలకు రెండుసార్లు తెగుళ్లకు మందులు పిచికారి చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. ఎన్నోసార్లు పిచికారి చేసిన తెగుళ్లు తగ్గలేదని పేర్కొన్నారు. తెగుళ్లు సోకితే పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోతున్నదని, తద్వారా రైతులందరూ తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. వేరుశనగ విత్తన కాయలను అధిక ధర పెట్టి కొనుగోలు చేయాలని కానీ రైతులు పండించిన పంటలకు ధర ఉండడం లేదన్నారు. వేరుశనగ విత్తనకాయలను 42 కేజీల కాయలు 3500 రూపాయలకు కొనుగోలు చేశామని, తాము పండించిన పంటకు మాత్రం 42 కేజీల ప్యాకెట్ 2500 రూపాయలు ధర పలుకుతున్నదని పలువురు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒక ఎకరా 30 బస్తాలు వేరుశనగ కాయలు దిగుబడి వచ్చేవని కానీ నేడు 15 బస్తాలు మాత్రమే దిగుబడి వస్తున్నదన్నారు.

తెగుళ్లలో తీవ్రంగా నష్టపోతున్నాం



నేను 4 ఎకరాల్లో వేరుశనగను సాగు చేశాను. ఒక ఎకరా వేరుశనగను సాగు చేయడానికి 20 వేలకు పైబడి ఖర్చు అయింది. విత్తనాలు మొలక ఎత్తిన 3 వారాలుగా తెగుళ్లు సోకుతున్నాయి. తెగుళ్లకు మందులు పిచికారి చేయడంలో చెట్లు మాత్రం ఏపుగా పెరిగాయి కానీ దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఎక్కువగా మచ్చ తెగులు వేరుశనగను నాశనం చేస్తున్నది. గతంలో ఒక ఎకరాకు 30 బస్తాలు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 15 బస్తాలు కూడా రావడం లేదు. దిగుబడి తగ్గిపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం.

-జగన్నాథ, నూలివీడు

పంట నష్టపరిహారం చెల్లించాలి



రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంట తెగుళ్ల వల్ల దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. రైతులు సాగుకు చేసిన ఖర్చులు కూడా వచ్చేటట్లు లేవు. అప్పులు చేసి పంటలను సాగు చేశాము. కానీ దిగుబడి తగ్గిపోవడంతో ఎక్కువగా నష్టపోతున్నాము. పండించిన పంటకు గిట్టుబాటు ధర కూడా లేదు. విత్తనకాయలను ఎక్కువ రేటుకు కొనుగోలు చేసినా మేము పండించిన కాయలు మాత్రం తక్కువ రేటుకు అమ్మాల్సి వస్తోంది. కావున ప్రభుత్వం స్పందించి వేరుశనగను సాగు చేసిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

- గల్లా వెంకటయ్య, అలుగుంటివాండ్లపల్లె

ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలి : జేసీ


స్ట్రాంగ్ రూములను పరిశీలించేందుకు వెళుతున్న జేసీ గణేశ్‌కుమార్

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 18: త్వరలో జరగబోతున్న సాధారణ ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జేసీ గణేశ్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూములను ఆయన పరిశీలించారు. ప్రతి సంవత్సరం స్థానిక సరస్వతీ జూనియర్ కళాశాలలో వీటిని భద్రపరిచేందుకు అవకాశం లేకుండాపోయింది. అందుకు ప్రత్యామ్నాయంగా గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల్లో ఈ రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయని, ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఎన్నికల నిర్వహణకు అధికారులకు షెల్టర్ కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికలు అయిపోయిన తరువాత ఈవీఎంలను కూడా ఇక్కడే భద్రపరుస్తారని అందుకు అనువుగా ఇక్కడ కొన్ని రూములను పరిశీలించామన్నారు. కలెక్టరుకు నివేదిక అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎన్నికల డీటీ నరేంద్ర, ఆర్ఐ అర్జున్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అప్పులు ఫుల్.. అభివృద్ధి నిల్

- సంక్షోభంలో సంక్షేమం... ఇది జగన్ పాలన : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 18: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసీపీ పాలనలో అభివృద్ధి లేక ప్రజలు అన్నివిధాలా తీవ్రంగా నష్టపోయారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. ఆదివారం జమ్మలమడుగులో ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. జగన్ పరిపాలనలో రాష్ట్రానికి అప్పులు ఫుల్, అభివృద్ధి నిల్ అన్నారు. సంక్షోభంలో సంక్షేమం ఇది జగన్‌రెడ్డి పాలన అన్నారు. రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. 1956 నుంచి 2014 వరకు 58 సంవత్సరాలలో నీలం సంజీవరెడ్డి మొదలుకుని కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి వరకు 16 మంది ముఖ్యమంత్రుల పాలనా కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు లక్ష కోట్ల రూపాయలు అన్నారు. 2014 నుంచి 2019 వరకు అయిదు సంవత్సరాల కాలంలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన అప్పు రూ.1.50 లక్షల కోట్లు అన్నారు. కాగా 2019 నుంచి నేటి వరకు నాలుగు సంవత్సరాల 9 నెలల్లో జగన్ ప్రభుత్వం చేసిన అదనపు అప్పు రూ.8.5 లక్షల కోట్లు అన్నారు. జగన్ పాలనలో కోట్ల రూపాయలు అప్పు చేసినా అభివృద్ధి లేదన్నారు. నిధుల కొరతతో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగలేదన్నారు. నిర్వహణకు కూడా నిధులు లేకపోవడంతో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకునిపోయిందన్నారు. రాష్ట్రంలో రహదారులు మృత్యుకుహరాలయ్యాయన్నారు. జగన్ పాలనలో సంక్షేమం మేడిపండులాగా మారిందని ఇచ్చేది గోరంత, లాక్కునేది కొండంత అన్నారు. అమ్మఒడి, చేయూత, ఆసరా, తదితర పథకాల ద్వారా ప్రభుత్వం ఇస్తున్న సొమ్మును నాన్న బుడ్డి (మద్యం) ద్వారా ప్రభుత్వం లాక్కుంటుందన్నారు. పెట్రోలు, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఆర్టీసీ చార్జీలు దారుణంగా పెంచారన్నారు. మట్టి ముంత ఇచ్చి వెండి చెంబు దొంగిలించినట్లుగా జగన్ పాలన దారుణంగా మారిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుబ్రమణ్యాశర్మ, మండలాధ్యక్షులు మంచాల పుష్పరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కైపా జానకీరామకృష్ణ, జమ్మలమడుగు పట్టణ అధ్యక్షుడు రాజేష్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు భూతమాపురం సుబ్బారావు, ఎస్సీ సెల్ నాయకులు సంజయ్, ప్రవీణ్, పాముల బ్రహ్మానందరెడ్డి, వెంకటేశ్, దేవదాసు, అమర్, ఉత్తన్న, కల్యాణ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై వైసీపీ మూకల దాడి

- ఇద్దరికి గాయాలు.. ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలింపు
- పోలీసుల పికెట్ ఉన్నా...బరి తెగించిన వైసీపీ నాయకులు
- ఇది పిరికిపంద చర్యగా అభివర్ణించిన భూపేశ్


దాడిలో గాయపడ్డ దండుపల్లెకు చెందిన మహేశ్

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 18: ఎర్రగుంట్ల మండలంలోని దండుపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వరపుత్రుడు, మహేశ్‌లపై చిర్రాజుపల్లెకు చెందిన 12 మంది వైసీపీ నాయకులు ఆదివారం రాత్రి దాడి చేసి తీవ్రంగా గాయపరచారు. టీడీపీ నాయకుల కథనం మేరకు... ఇటీవల దండుపల్లె గ్రామానికి చెందిన వరపుత్రుడునిపై వైసీపీ వారు దాడి చేసి గాయపరచారు. దీంతో గ్రామంలో గత కొద్ది రోజులుగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. పోలీసు పికెట్ ఉన్నా లెక్కచేయకుండా ఆదివారం రాత్రి చిర్రాజుపల్లెకు చెందిన సుమారు 12 మంది వైసీపీ నాయకులు వరపుత్రుడు, మహేష్ ఇళ్లపై దాడికి తెగపడ్డారు. కర్రలతో ఇతర వస్తువులతో మూకుమ్మడిగా దాడి చేయడంతో మహేశ్ తలకు తీవ్ర గాయాలు కాగా, వరపుత్రునికి చేయి విరిగింది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు అక్కడికి చేరుకుని 108లో గాయపడ్డ వారిని ప్రొద్దుటూరుకు తరలిస్తుండగా సీఐ ఈశ్వరయ్య గాయపడ్డ వారికి చిలమకూరులోని ఆసుపత్రిలో చికిత్స చేయిస్తామని అడ్డుకున్నారు. అయినా టీడీపీ శ్రేణులు మాత్రం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స చేస్తున్నారు.

ఆసుపత్రికి చేరుకున్న భూపేశ్‌రెడ్డి

విషయం తెలుసుకున్న టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తన అనుచరులతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని వారిని పరామర్శించి భరోసా ఇచ్చారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ప్రొద్దుటూరు ఆసుపత్రికి భారీగా చేరుకున్నారు. టీడీపీ కార్యకర్తలపై దాడి చేయడం పిరికిపంద చర్య అని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. ఆసుపత్రిలో ఆయన మాట్లాడుతూ దండుపల్లెలో పోలీసులుండగానే ఇలాంటి సంఘటన జరగడం దేనికి సంకేతమో పోలీసులు చెప్పాల్సిన అవసరముందన్నారు. ఇలాంటి కవ్వింపు చర్యలకు తాము భయపడమన్నారు. అతి త్వరలో ప్రజా క్షేత్రంలో ప్రజలు ఎమ్మెల్యేకి బుద్ధిచెబుతారన్నారు. ధైర్యముంటే వచ్చే ఎన్నికల్లో ఎవరి సత్తా ఏంటో తేల్చుకుందామని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు మళ్లీ జరిగితే తగిన రీతిలో తాము కూడా బుద్ధి చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి, టీడీపీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇకపై టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకునే ప్రశ్నేలేదని ఈ సంఘటనపై ఘాటుగా స్పందించారు. తన కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఈ విషయంపై వివరణ కోరేందుకు ఎర్రగుంట్ల అర్బన్ సీఐ ఈశ్వరయ్య, డీఎస్పీ యశ్వంత్‌లకు ఫోన్ చేయగా వారు లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం. ఈ సంఘటనతో దండుపల్లె, చిర్రాజుపల్లెలో మరింత భద్రత పెంచినట్లు తెలిసింది.


బాధితులతో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

ఓటమి ఎరుగని వీరుడు ఛత్రపతి శివాజీ

● ఛత్రపతి శివాజీ ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు



కడప నగరంలో శోభాయాత్రను నిర్వహిస్తున్న దృశ్యం

కడప (కల్చరల్), ఫిబ్రవరి 18: హిందూ రాజ్య స్థాపన కోసం భవానీ మాత అందించిన ఖడ్గంతో నాడు శత్రురాజులతో పోరు సలిపి ఓటమి ఎరుగని వీరుడిగా దేశప్రజల నీరాజనాలు అందుకున్న ఏకైక హిందూ మతోద్ధారకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని ఛత్రపతి శివాజీ ఐక్య వేదిక గౌరవాధ్యక్షుడు అంబారపు వెంకటేశ్వర్లు కొనియాడారు. ఆదివారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఛత్రపతి శివాజీ ఐక్యవేదిక కడప నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 గంటలకు స్థానిక మాతా అంబాభవాని దేవస్థానం నుంచి నగర పురవీధుల లో ముందుస్తు జయంతి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా శోభాయాత్ర చేపట్టారు. శోభాయాత్రలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి పాల్గొన్నారు. ఐక్యవేదిక చైర్మన్ రవిశంకర్‌రావు చవాన్, ట్రెజరర్ వీరేంద్రరావు, సభ్యులు జగదీష్, నాగార్జున, నిఖిల్ హిందూ ధార్మిక వేత్తలు కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారు.

దోపిడీ దొంగలు కావాలా.. అభివృద్ధి అందించే నేతలు కావాలా

● బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీలో పుత్తా

చెన్నూరు, ఫిబ్రవరి 18 : 'రాష్ట్రాన్ని దోచుకునే దొంగలు కావాలా... లేక అభివృద్ధి అందించే నేతలు కావాలా' అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం చెన్నూరులో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలోని ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. కొండలు, గుట్టలు, మట్టి అన్నింటినీ దోచుకోవడంతో వారి ఆదాయం లెక్కలేకుండాపోయిందన్నారు. ఇలాంటి పాలనకు చరమగీతం పాడాలన్నారు. టీడీపీని ఆదరించి గెలిపిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

టీడీపీలో 300 కుటుంబాలు చేరిక

మండలంలో వైసీపీ నేతగా ఆ పార్టీకి వీరవిధేయుడుగా ఉన్న పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి తన 300 మంది వర్గీయులతో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరినీ పుత్తా పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ కార్యక్రమ సందర్భంగా చెన్నూరులో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే స్థానికులు పుత్తాకు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో యువనేత పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, డాక్టర్ ఆదర్శ్‌రెడ్డి, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి, బలిజ సంఘం నేత ఆకుల ప్రసాద్‌బాబు, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, ఉపాధ్యక్షుడు కుంచెం రామక్రిష్ణారెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు సుదర్శనరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, పొట్టిపాటి జగదీశ్వర్ రెడ్డి, హనుమాన్‌రెడ్డి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తదితరులు

వైసీపీ మృగాలను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం

● తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 18 : వైసీపీ మృగాలను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మాధవీరెడ్డిలుఏ తెలిపారు. ఆదివారం కడప నగరం 25వ డివిజనులో బాబు షూరిటీ భవిస్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటకీ వెళ్లి టీడీపీ కరపత్రాలు అందించారు. టీడీపీ ప్రభ్తువం అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంఏమం అభివృద్ధి ఫలాలపై ప్రజలకు వివరించారు. అలాగే చంద్రబాబునాయుడును సీఎం చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. డిప్యూటీ సీఎం అంజద్ బాషా దిగజారి మాట్లాడుతున్నారని విమర్శింఆచారు. టీడీపీ అధికారంలోకి రాగానే అంజద్‌బాషను బట్టలూడదీసి కొడతానని హెచ్చరించారు. నా తమ్ముడు ఇలానే మాట్లాడుతాడని అంజద్‌బాషా చెప్పడం సిగ్గుచేటన్నారు. వైసీపీ ప్రభుత్వం తట్ట బుట్ట సర్దుకుపోయేలా ప్రజలు తరిమికొట్టాలని కోరారు. కార్యకర్తలకు తాము అండగా ఉంటామని పిలుపునిచ్చారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి

టీడీపీ తీర్థం పుచ్చుకున్న గిరీష్‌కుమార్

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 18: కడప నగరం 25వ డివిజన్ పరిధిలోని లా యం గిరీష్ కుమార్ తెలుగుదేశం పార్టీ తీర్థం పుచుకున్నారు. ఆయనతో పాటు సుమారు 250 కుటుంబాలు టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ద్వారకానగర్ నుంచి గిరీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయన అనుచరులు నగర వీధులగుండా స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు హరిప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తా సమక్షంలో 50 కుటుంబాలు టీడీపీలో చేరిక

సీకేదిన్నె, ఫిబ్రవరి 18: తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. చింతకొమ్మదిన్నె మండలం కార్పొరేషన్‌లో విలీనమైన 18వ డివిజన్ వాల్మీకి నగర్ విశ్వనాథపురంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊటుకూరు మాజీ సర్పంచ్ పెమ్మేలు సుబ్బిరెడ్డి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి తెలుగుదేశం హయాంలోనే జరిగిందని, అభివృద్ధికి మారుపేరుగా టీడీపీ ఆవిర్భవించిందన్నారు. సూపర్-6 పథకాల పేరుతో చంద్రబాబునాయుడు మహిళలకు అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అధిక ధరలతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తిరిగి అభివృద్ధి సంక్షేమం జరగాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎం తైనా ఉందన్నారు. టీడీపీ యువనాయకులు పుత్తా చైతన్యరెడ్డి, లక్ష్మీరెడ్డి, సాయినరసింహారెడ్డి, నాయకులు పి.వి.కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, పి.వి.సుబ్బారెడ్డి, ఏటూరు రామచంద్రా రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





'ఇరువురిపై బహిష్కరణ వేటు'

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 18:జమ్మలమడుగు అంగన్వాడీ ప్రాజెక్టు పరిధిలోని నాయకురాళ్లు భాగ్యమ్మ, లక్ష్మీదేవి ఆరోపణలు వచ్చినందున వారిని సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) కడప జిల్లా కమిటీ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గతంలో సీఐటీయూలో పనిచేసిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఉద్యోగాలు, ప్రమోషన్లు ఇప్పిస్తానని చెప్పి ప్రలోభాలకు గురి చేసి డబ్బు వసూలుకు పాల్పడిన కారణంగా జమ్మలమడుగు పోలీసుస్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైందన్నారు. ఆ వ్యక్తిని సీఐటీయూ నుంచి బహిష్కరించామన్నారు. కాగా అతనితో భాగ్యమ్మ, లక్ష్మీదేవి సత్సంబంధాలు కలిగి సంఘ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో కమిటీ నిర్ణయం మేరకు వారిపై బహిష్కరణ వేటు వేశామన్నారు. త్వరలోనే జమ్మలమడుగు ఐసీడీఎస్ నూతన నాయకత్వాన్ని ఎంపిక చేస్తామన్నారు. సీఐటీయూ జమ్మలమడుగు అధ్యక్ష, కార్యదర్శులు వినయ్, విజయ్, దాసు, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 18 : కడప నగరం కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఎం.వీరభద్రయ్యకు నాగపూర్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ ఉమాచటర్జీ ఆధ్వర్యంలో ఇంపాక్ట్ అండ్ ఇంప్లికేషన్ ఆఫ్ సివిల్ న్యూక్లియర్ డీల్ ఆన్ ఇండో యుఎస్ బై లేటరల్ రిలేషన్స్ అనే అనలథిటికల్ స్టడీ పరిశోధన గ్రంధాన్ని సమర్పించినందుకు గాను ఈయనకు డాక్టరేట్ లభించింది.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

వేంపల్లె, ఫిబ్రవరి 18: స్థానిక గండిరోడ్డులో నూతనంగా నిర్మించిన వేణుగోపాలకృష్ణ స్వామి విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమాల అనంతరం విగ్రహ ప్రాణప్రతిష్ఠ, ధ్వజశిఖర పూర్ణాహుతి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు సుధాకర్‌శర్మ నేతృత్వంలో స్వామివారిని ప్రత్యేక అలంకరించి అభిషేకం, కుంకుమార్చనలు చేశారు. అలాగే ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తబద్ధంగా రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలకృష్ణస్వామి కళ్యాణం జరిగింది.అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, సర్పంచు మునేష్, మాజీ సర్పంచు రామాంజనేయరెడ్డి, సభ్యులు మధుసూదన్‌రెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

20న ఉత్తర ద్వారదర్శనం

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 18:రామాపురం క్షేత్రంలో ఈనెల 20న మోక్షనారాయణస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 20న శుక్ల ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శిస్తే ఎన్నో జన్మల పుణ్యఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం.

రాప్తాడు సభ ఆత్మస్తుతి పరనిందకే పరిమితం

● ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 18: రాప్తాడులో జరిగిన సభలో సీఎం జగన్ మాట్లాడుతూ పేదలకు పెత్తందార్లకు మధ్య పోరాటం జరుగుతుందని చెప్పడం హాస్యాస్పదం, ఈ యుద్ధం పేదలకు, పెత్తందార్లకు మధ్య కాదు... జగన్‌కు ఏపీ ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. రాప్తాడు సభ ఆత్మస్తుతి పరనిందకే పరిమితమైందని స్పష్టం చేశారు. ఆదివారం పులివెందులలో తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ చంద్రబాబు జపం చేయడానికి రాప్తాడు సభ పెట్టినట్లుందన్నారు. రైతులకు ఏం మేలు చేశావో రాయలసీమ రైతులను అడిగితే చెబుతారన్నారు. రైతులు సంతోషంగా ఉంటే పులివెందులలోనే అత్యధికంగా ఎందుకు ఆత్మహత్యలు చేసుకున్నారని ప్రశ్నించారు. రాయలసీమలో సభ పెట్టి సీమకు ఇది చేశానని చెప్పుకోలేని దీనస్థితిలో ఉన్నారన్నారు. కడప స్టీలు ప్లాంటు ఎందుకు పెట్టలేదో చెప్పాలన్నారు. సీమలో ఇన్నివేల ఎకరాలకు నీళ్లిచ్చానని.. కొత్త ప్రాజెక్టులు ఇన్ని కట్టానని.. ఇన్ని కొత్త పరిశ్రమలు తెచ్చానని ఎందుకు చెప్పలేకున్నాడని ప్రశ్నించారు.

బీజేపీ జాతీయ సమావేశానికి రామచంద్రారెడ్డి హాజరు

చక్రాయపేట, ఫిబ్రవరి 18: ప్ర ధాన మంత్రి మోదీ, హోం శాఖ కేంద్ర మంత్రి అమిత్‌షా అధ్వర్యంలో సాగిన బీజేపీ జాతీయ సమావేశానికి చక్రాయపేట మం డలానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కె.రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన ఈ సమావేశానికి దేశంలోని బీజేపీ ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నట్లు కె.రామచంద్రారెడ్డి తెలిపారు. జరగబోయే లోక్‌సభ ఎన్నికలలో విజయం సాధించేందుకు అనుసరించాల్సిన అంశాలపై వివరించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా సాగుతున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 18: పట్టణంలో వెలసిన పద్మావతీ సమేత కల్యాణ వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మూడో రోజైన ఆదివారం నవమిని పురస్కరించుకొని ప్రధాన అర్చకులు వరదాచార్యులు, అర్చకులు భరద్వాజ ఆలయంలోని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఉదయం గ్రామోత్సవంగా శ్రీవేంకటేశ్వరస్వామి చిన్నశేషవాహనంపై ఊరేగారు. గ్రామోత్సవంగా వస్తున్న స్వామివారు తమ ఇంటి ముంగిటకు చేరుకోగానే భక్తులు టెంకాయ సమర్పించి మొక్కుకున్నారు. కాగా రాత్రికి పెద్దశేషవాహనంపై ఊరేగారు.



'సభను విజయవంతం చేయండి'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 18: ప్రజాహక్కుల పరిరక్షణ కోసం ఈనెల 23న కడపలో తలపెట్టిన సభను విజయవంతం చేసేందుకు కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు హాజరుకావాలని సౌత్ ఇండియా మ షాయన్ యాక్షన్ బోర్డు కమిటీ కన్వీనర్ ఎస్.జకావుద్దీన్‌హుసేని, కో కన్వీనర్ సయ్యద్ సలావుద్దీన్ పిలుపునిచ్చారు.ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సౌత్ ఇండియా మషాయిన్ యాక్షన్ బోర్డు కమిటీ, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23న సాయంత్రం 6 గంటలకు రవీంద్రనగర్‌లోని యూఎస్ మహల్‌లో జరుగనున్న సభకు ప్రముఖ న్యాయకోవిదులు, బార్ కౌన్సిల్ సభ్యులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. దేశ ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని కాపాడాలనే ఏకైక లక్ష్యంతో భారతరాజ్యాంగం ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యంగా ప్రజల హక్కులు, స్వే చ్ఛకు భంగం కలిచే ఎలాంటి చర్యలలైనా ప్రజ లు ముక్తకంఠంతో వ్యతిరేకించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రజలను అప్రమ త్తం చేసేందుకు ఈ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు జహిరుల్లా హుసేని, తాహీరుల్లా ఖాద్రి, సిరాజ్‌బుఖారి, జమీల్ బుఖారి పాల్గొన్నారు

రోగుల పట్ల వైద్యులు బాధ్యతగా వ్యవహరించాలి

● రిమ్స్‌లో నైతిక అవగాహన కార్యక్రమం



ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ సుధాకర్, ప్రిన్సిపాల్, వైద్య విద్యార్థులు తదితరులు

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 18: రోగుల పట్ల వైద్యులు బాధ్యతగా వ్యవహరించాలని ఏపీ మెడికల్ కౌన్సిల్ ద్వారా నియమించబడిన డాక్టర్ సుధాకర్ హాజరయ్యారు. ఆదివారం కడప రిమ్స్ వైద్యశాలలో వైద్య విద్యార్థులకు నైతిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ త్వరలో వైద్యవిద్య పూర్తి చేసుకుని వైద్యులుగా సేవలు అందించే క్ర మంలో ఈ కార్యక్రమం ఎంతగానో అవసరం అవుతుందన్నారు. వైద్యులు రో గులతో ఎలా ప్రవర్తించాలి, రోగి పట్ల వైద్యుడి బాధ్యత ఏమిటి అనే విషయాలను వివరించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శారద, డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, వైద్యవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

22న శ్యామల మాతంగిదేవి విగ్రహ ప్రతిష్ఠ



చెన్నూరు పుష్పగిరి రోడ్డులో నిర్మించిన శ్యామల మాతంగిదేవి ఆలయం

చెన్నూరు, ఫిబ్రవరి 18 : చెన్నూరు మండలం పుష్పగిరి రోడ్డులోని గోపవరం గ్రామానికి వెళ్లే దారిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్యామల మాతంగిదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ స్వామి చేతుల మీదుగా శ్యామల మాతంగిదేవి యంత్ర విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22న మాఘశుద్ధ త్రయోదశి గురువారం 10.40 గంటలకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని,మండల ప్రజలందరూ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు తరలిరావాలని వారు తెలిపారు. అలాగే అన్నప్రసాద వితరణతో పాటు బండలాగుడు పోటీలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. మొదటి బహుమతి రూ.40వేల నుంచి ఐదు బహుమతులు ఉంటాయన్నారు. ప్రజల సహా య సహకారాలతో ఆలయ నిర్మాణం చేపట్టామని, గతంలో ఎక్కడా లేని విధంగా శ్యామల మాతంగి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నామ ని, అమ్మవారు శక్తిస్వరూపిణిగా కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారు కొలువు అవుతుందని ప్రజలందరూ తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 18 : వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పేర్కొన్నారు. ఆదివారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జాతీయ రహదారి భద్రోత్సవాల్లో భాగంగా కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది డ్రైవింగ్‌పై అవగాహన లేకుండానే వాహనాలు అతివేగంగా నడుపుతూ చిన్న వయసులోనే ప్రమాదాలకు గురై తల్లిదండ్రులకు తీరని శోకం కలిగిస్తున్నారన్నారు. అతివేగంగా వాహనాలు నడపడం, వాహన సామర్థ్యానికి మించి ప్రయాణాలు చేయడం, మొబైల్ ఫోనులో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం లాంటి అలవాట్లను వదిలిపెట్టాలన్నారు. అలాగే హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 18 : గోపవరం మండల టీడీపీ నాయకుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి శివారెడ్డి సోదరుని వివాహ వేడుకలు స్థానిక బయనపల్లె సమీపంలోని బొచ్చిరెడ్డి కల్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. వివాహానికి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లెం యల్లారెడ్డి, రామ్మోహనరెడ్డి, గాజులపల్లె చంద్రశేఖర్‌రెడ్డి, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్ బాషా, కేవీ సుబ్బారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి, మాచుపల్లె వెంకటక్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రధానమంత్రి విశ్వకర్మయోజన పథకం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 18 : పేదల అభ్యున్నతే ప్రధానమంత్రి విశ్వకర్మయోజన పథకం అని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు అన్నారు. భారత దేశం పేద ప్రజలను ఆర్థికంగా స్థిరపరచాలని బీజేపీ భావిస్తుందని పేర్కొన్నారు. దేశంలో 24 రకాల చేతివృత్తుల వారికి వారు చేస్తున్న పనిలో నైపుణ్యత కోసం శిక్షణ ఇప్పించి ప్రతిరోజూ 500 రూపాయలు స్టైఫండ్‌గా ఇచ్చి శిక్షణ అనంతరం వారికి ఆ వృత్తికి సంబంధించిన రూ.15వేలు విలువ చేసే పరికరాలు, నైపుణ్యత సర్టిఫికెట్లు ఇస్తుందన్నారు. అనంతరం ఎటువంటి హామీ లేకుండా వారికి లక్ష రుణసదుపాయం ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. ఈ మొత్తం 18 నెలల్లో చెల్లించి మళ్లీ ఎటువంటి హామీ లేకుండా చెల్లిస్తే రూ.2లక్షల వరకు పొందవచ్చన్నారు.

చేనేతలకు అండగా నారా భువనేశ్వరి, బ్రాహ్మణి


మాట్లాడుతున్న సుంకర వేణుగోపాల్

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 18 : నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి చేనేత రంగానికి అండగా నిలుస్తున్నారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం బీసీ సెల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారా భువనేశ్వరి, బ్రాహ్మణిలు టాటా, తనేరా సంస్థ సహకారంతో మంగళగిరిలో పైలెట్ ప్రాజెక్టుగా వీవర్ శాలను ప్రారంభించి చేనేతలను ఆదుకోవడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. చేనేత కార్మికులకు అధునాతన చేనేత మగ్గాలు సమకూర్చి వస్త్రాలకు రంగులు అందడంలో శిక్షణ ఇప్పించడానికి చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సిద్ధయ్య, తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి రామునాయుడు, పాలసుబ్బరాయుడు, గోమేధికం సుదర్శన్, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపి కేసులు నమోదు చేయాలి : కుంచం



జమ్మలమడుగు, ఫిబ్రవరి 18: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన విద్యుత్తు స్కాంపై కేంద్ర నేర పరిశోధక సంస్థ ఇన్వెస్టిగేషన్ చేసి ఆంధ్రప్రదేశ్‌లోని అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జమ్మలమడుగులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అవినీతికి అంతులేకుండాపోయిందన్నారు. అర్హతలేని సంస్థలకు విద్యుత్తు సబ్సిడీ మంజూరు చేయడంలోని స్కాం గురించి ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వైసీపీ పెయిడ్ ఆర్టిస్టులను ప్రజలు తిప్పికొట్టాలి

- టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి


మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 18: వైసీపీకి చెందిన కొందరు పెయిడ్ ఆర్టిస్టులు రంగంలోకి దిగి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ప్రజలు వారి మాటలు నమ్మరాదని, వారు చెప్పే మాటలను తిప్పికొట్టాలని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి విమర్శలు చేశారు. ఆదివారం సాయంత్రం 6గంటలకు జమ్మలమడుగు టీడీపీ కార్యాలయ ఆవరణలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషియల్ మీడియా అవగాహన కార్యక్రమం నిర్వహించి కార్యకర్తలకు సూచనలు ఇచ్చారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్ల మీడియా పాత్ర కీలకమన్నారు. టీడీపీ శ్రేణులు సోషియల్ మీడియా వేదికగా చాలా క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి రమణారెడ్డి, పార్లమెంటు అధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాబోవు ఎన్నికల్లో వైసీపీ పతనం తప్పదు



బద్వేలు, ఖాజీపేటలో టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 18 : రాబోవు ఎన్నికల్లో వైసీపీ పతనం తప్పదని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 11వ వార్డులో చెన్నుపల్లి సుబ్బారెడ్డి కుమారుడు నిషాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో సుమారు 500 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీడీపీ కండువా కప్పి రితీష్, విజయమ్మ వైసీపీ నాయకులను ఆహ్వానించారు. వైసీపీ నుంచి టీడీపీలోకి 11వ వార్డు గౌరీశంకర్‌నగర్, ఇషాద్‌నగర్ తదితర కాలనీలకు చెందిన వారు, చెన్నుపల్లి నిషాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో డివెంకటరమణ, వెంకటేశ్‌శ్రీనివాసులు, క్రిష్టానాయక్, పెద్దిరెడ్డి, పెద్దవెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి, నాగేశ్వర్‌రావు, నాగరాజు, గంటా విలియం, రామచంద్ర తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి మిత్తికాయల రమణ, ప్రసాద్, శివయ్యస్వామి, మస్తాన్‌బాబు, సింగసాని విజయ్‌కుమార్, బిగ్ బాస్, జహంగీర్‌బాషా, పెద్దిరెడ్డి క్రిష్ణారెడ్డి, నిమ్మకాయల భూపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, పార్థసారధిరెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించండి : పుట్టా

ఖాజీపేట, ఫిబ్రవరి 18: రాబోవు ఎన్నికల్లో టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, టీటీడీ మాజీ ఛైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం చెముళ్లపల్లె గ్రామంలో చింతకుంట సుబాన్‌బాష, సిద్దరాయుడు, బాష, బిందుగాళ్ల సప్తగిరితోపాటు 60 కుటుంబాలు మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆలమూరి దస్తగిరి, బాలుడు, మౌలాలి, కొప్పగంటి ఇమామ్, ఖాసీంపీరా, చాంద్‌బాష, యువరాజ్, జనసేన పార్టీ మైదుకూరు ఇన్‌చార్జి మల్‌హోత్ర, బీఎల్ శ్రీనివాసులు, కటారి కృష్ణ, ఫరూక్, పాపన మల్లికార్జునరెడ్డి, జిలానీ, సుబ్బయ్య, వీరయ్య, రెడ్యం వెంకటరామిరెడ్డి, కొత్తపేట, బుజ్జిరెడ్డి, బాలకొండారెడ్డి, పిచ్చినాయుడు, రాము, షఫి, పూల రియాజ్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: పోరుమామిళ్ల మండలంలో వైసీపీ నుంచి 80 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఆదివారం పోరుమామిళ్ల మండలంలోని చిన్నయరసాల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్‌రెడ్డి సమక్షంలో కల్లూరి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో 80 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు కె.వెంకటక్రిష్టారెడ్డి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్, కొండా రామక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

చాపాడు..: రాబోయే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. ఖాదర్‌పల్లె గ్రామంలో ఆదివారం వైసీపీకి చెందిన వంద కుటుంబాలవారు సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారందరికీ టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పాల మాబు, చింపర్తి మాబు, ఫకృద్దీన్, లాల్‌బాష, బికారిసాబ్, ఖాసీంవల్లి తదితర కుటుంబాలవారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి , జనసేన మైదుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మల్హోత్ర, మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు నాయబ్‌రసూల్, మేకల బాబు, అక్బర్ సలీం, వై.వెంకటసుబ్బారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు టౌన్..: చంద్రబాబుతోనే రాష్ట్రానికి దశ, దిశ అని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు అగ్రహారంలో మాజీ ఎంపీటీసీ హనుమంతు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సుమారు 200 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. వైసీపీ నుంచి హనుమంతు సుబ్రమణ్యం, సుబ్బయ్య, పసుపులేటి బాలయ్య, గవ్వల గురయ్య, వీరారెడ్డి, అల్లం ప్రతాప్, వాయలేటి శ్రీనివాసులు, బాదిరెడ్డి మల్లికార్జున, అల్లం శ్రీనివాసులు వీరారెడ్డి, హనుమంతువెంకటేశ్వర్లు, మంచా చిన్నగురయ్య, రమణయ్య, చిట్టిబాబు, సంపత్,రాయుడు, తిరుపాలమ్మ, లక్షుమ్మ, గురమ్మ, సుభాషిణి, అంజనమ్మ తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ బొజ్జ అరుణమ్మ, మాజీ జడ్పీటీసీ రాంభూపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పార్థసారధిరెడ్డి, పట్టణ కార్యదర్శి మిత్తికాయల రమణ, సింగసాని బుజ్జి, మాచుపల్లె లక్ష్మీదేవి, క్రిష్టారెడ్డి, బిగ్‌బాస్, జహంగీర్‌బాషా, వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 18 : విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని గౌతమ్ హైస్కూల్ కరస్పాండెంట్ టి.సుధీర్ పేర్కొన్నారు. ఆదివారం గౌతమ్ హైస్కూల్ 36వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు టీసీఎం నాయుడు, హర్షప్రియ, ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి, మల్లికార్జున రావు,ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సభ నూతన అధ్యక్షుడి ఎన్నిక


ఆర్యవైశ్య సభ నూతన అధ్యక్షుడు, పాల్గొన్నవారు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 18: జమ్మలమడుగులో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి దేవస్థానానికి ఆర్యవైశ్య సభకు నూతన అధ్యక్షుడుగా మల్లెంకొండు సుబ్రమణ్యంను ఎన్నిక చేసినట్లు అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆలయ ట్రస్టీలు కర్నాటి జనార్ధన్, వంకధార నటరాజ ఆధ్వర్యంలో అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చేసినట్లు తెలిపారు. ఆయనతోపాటు ప్రధాన కార్యదర్శిగా మలిపెద్ది వెంగయ్య, కోశాధికారి ఎస్.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఎన్నిక అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు శరణా వెంకటకిశోర్, లక్ష్మీనారాయణ, రాధా మనోహర్, ఆర్యవైశ్య కమిటీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో బద్వేలు విజేత

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 18 : పోరుమామిళ్లలోని ఎంపీటీసీ కల్వకూరి రమణ నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంటులో బద్వేలు టీం విజేతగా నిలవడంతో వారికి టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా రూ.50,016, పోరుమామిళ్ల ఆర్గనైజింగ్ జట్టుకు రూ.30,016 నగదును మూడో బహుమతి రూ.15,016 నగదు పోరుమామిళ్ల టీంకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు భైరవ ప్రసాద్, ఎంపీటీసీ కల్వకూరి రమణ పాల్గొన్నారు.

ఉపాధిలేని యువతపై సర్వే

బద్వేలు, ఫిబ్రవరి 18: పట్టణంలోని ఎస్‌బీవీఆర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గుంతపల్లె గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా వలంటీర్లతో సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో అధికారిక విద్య లేదా సాధారణ ఉపాధిలేని యువత అనే అంశంపై సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త దొరస్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్లు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదం

కార్పొరేట్ రాజకీయాలను తుదముట్టించాలి

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 18 : ఎలక్టోరల్ బాండ్లు భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు పెద్ద ప్రమాదమని అవి ప్రజా రాజకీయాలను రూపు మాపి కార్పొరేట్ రాజకీయాలకు లైసెన్సు ఇవ్వడమేనని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ కిరణ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాయలంలో ఎలక్టోరల్ బాండ్లు - ప్రమాదంలో ప్రజాస్వామ్యం అనే అంశం పై సదస్సుజరిగింది. ఈసదస్సులో కిరణ్‌మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధమైన ఎలక్టోరల్ బాండ్లను సుప్రీం కోర్టు రద్దుచేయడం ప్రజాస్వామ్యానికి ఊపిరిలూదడంగా భావించాలన్నారు. 2018 లో తీసుకోచ్చిన ఈ ఎన్నికల బాండ్లు సమాచార హక్కు చట్టానికి వ్యతిరేకమైనవన్నారు. రాజకీయ పార్టీలకు చందాలు ఎవ్వరు ఇస్తున్నారో తెలపకుండా గోప్యతగా వుంచటం చాలా ప్రమాదకరమన్నారు. ఇది కార్పొరేట్ శక్తులకు రాజకీయ పార్టీలకు మధ్య అక్రమ బంధాలు ఏర్పడి దేశ సంపద దోచుకోబడుతుందన్నారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో ఇలాంటి దుర్మార్గమైన చట్టాలను తెచ్చి పార్టీ నీతిబాహ్య రాజకీయాలను చాటుకుంద న్నారు. జేవీవీ జిల్లాసమతా కన్వీనర్ దేవమణి, తవ్వా సురేష్, రాజశేఖర్, మురళీ దాదాహయాత్, శ్రీరాములు పెంచలయ్య ప్రియాంక పాల్గొన్నారు.

సీఎం సభకు తరలివెళ్లిన ఆర్టీసీ బస్సులు

ఇబ్బందుల్లో ప్రయాణికులు




పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు, జమ్మలమడుగు పాత బస్టాండులో ప్రైవేటు బస్సు, ఆటోలు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 18 : అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం ముఖ్యమంత్రి సభకు ఆర్టీసీ బస్సులు తరలివెళ్లడంతో పోరు మామిళ్ల ప్రాంతంలో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం పోరుమామిళ్లలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రయాణికులు తమ గమ్యస్థానాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా బద్వేలు,మైదుకూరు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బస్టాండులోనే గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆటోల్లోనే వెళ్లాల్సి వచ్చింది. అమగంపల్లె వెళ్లే ప్రయాణికులు చాలా మంది మైదుకూరు బస్సులు లేక ఆటోలనే నమ్ముకున్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో పాత బస్టాండులో ప్రయాణికులు ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. జమ్మలమడుగు ప్రాంతం నుంచి ప్రొద్దుటూరు, కడప, ముద్దనూరు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, కర్నూలు ప్రాంతాలకు ప్రతిరోజు అన్ని బస్సులలో ప్రయాణికుల రద్దీ ఉంటుంది. ఆదివారం ఉదయం నుంచి జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నుంచి వివిధ గ్రామాలకు, మండలాలకు సుమారు 42 బస్సులు పంపించినట్లు తెలుస్తోంది.

దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. అనంతపురం రాప్తాడులో జరిగే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభకు బస్సులను పంపడం జరిగింది. కొన్ని బస్సులు జనాలు లేక ఖాళీగా వెళ్లినట్లు తెలుస్తోంది.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఖాజీపేట, ఫిబ్రవరి 18: ప్రత్యేక అలంకరణలో బాలపోలేరమ్మ దర్శనమిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని మల్లాయపల్లెలో బాలపోలేరమ్మ ఐదో వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వైభవంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ



రాజుపాలెం, ఫిబ్రవరి 18 : మండల పరిధిలోని కొట్టాల గ్రామంలో ఆదివారం పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా ప్రత్యేక బోనాలు ఏర్పాటు చేసి పెద్దమ్మకు సమర్పించి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏళ్ల తరబడి ఈ గ్రామంలో ఒక్క దేవాలయం కూడా లేకపోవడంతో పాటు మారుమూల గ్రామం కావడంతో ఒక్కసారిగా పెద్దమ్మ గుడి ఏర్పాటు చేసుకుని విగ్రహ ప్రతిష్ఠ చేయడం ఆ గ్రామ ప్రజలకు ఎంతో సంతోషాన్నిచ్చింది. గ్రామంలో శివాలయం, రామాలయం తదితర గుడి నిర్మాణాలు త్వరలో పూర్తవుతాయన్నారు. పోతురాజును ప్రత్యేక అలంకరణ చేసి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో గ్రామంలోని అందరూ పాల్గొనడంతో పాటు సందడి వాతావరణం నెలకొంది.

ఘనంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ

జమ్మలమడుగు, ఫిబ్రవరి 18: జమ్మలమడుగు మండలంలోని పూర్వపు బొమ్మేపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో దొంతికోన సమీపాన ఆదివారం మారెమ్మ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మూడె రామనాయక్ విగ్రహానికి వితరణ అందించగా మూడే సుబ్బరాయుడు, మూడే రాముడు వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు.

నేడు టీడీపీ కార్యాలయం ప్రారంభం

కాశినాయన ఫిబ్రవరి18: మండల కేంద్రమైన నర్సాపురంలో సోమవారం ఉదయం 9గంటలకు బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్‌రెడ్డి చేతుల మీదుగా టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవం ఉంటుందని కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి తెలిపారు. మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదంచేయాలని వారు కోరారు.

'మొద్దునిద్రలో ప్రభుత్వాలు'

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 18 : నిత్యావసర వస్తువుల ధరలు మండుతున్నా ప్రభుత్వాలు మాత్రం మొద్దునిద్రలో ఉందని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగుమస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ అధిక ధరలకు హద్దే లేదు, పాలక ప్రభుత్వాలకు సిగ్గేలేదన్న రీతిలో కేంద్రంలో మోదీ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని తెలిపారు. సామాన్య ప్రజలు ఏమీ కొనలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. మరో వైపు జగన్ ప్రజల అవసరాలు పట్టించుకోవడంలేదన్నారు. ధరలను నియంత్రించకుంటే ఆయా పార్టీలకు సమాధి కట్టే విధంగా ఉంటుందన్నారు.

ఓటమికి వైసీపీ సిద్ధం కావాల్సిందే ..!

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 18 : ఎన్ని రకాలుగా రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టాలనుకున్నా ఓటమికి వైసీపీ సిద్ధపడాల్సిందేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం 30 వవార్డు నాగేంద్రనగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాబూ 6 గ్యారెంటీల కరపత్రాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ సీతారామిరెడ్డి,భరత్‌కుమార్ రెడ్డి,పాణ్యం సుబ్బరాయుడు, ఆవుల దస్తగిరి తాటి శీను పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: టీడీపీతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుంటుందని వచ్చే ఎన్నికల్లో అఖండమెజారిటీతో గెలిపించాలని టీడీపీ నాయకుడు సీఎం సురేష్‌నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం 10 వవార్డు సుబ్బిరెడ్డి కొట్టాలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా బాబు ఆరు గ్యారెంటీల కరపత్రాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ ఛైర్మెన్ ముక్తియార్, రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి ఈవీ సుధాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కలసపాడు..: మండలంలోని చింతలపల్లె గ్రామంలో ఆదివారం బాబు భవిష్యత్తు కరపత్రాలను ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న పంపిణీ చేశారు. సైకిలు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్‌రంతు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి ఉపాధ్యక్షుడు పట్టాభిరెడ్డి, ప్రధాన కార్యదర్శి భద్రయ్య, పెద్దసంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




ప్రొద్దుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సీఎం సురేష్‌నాయుడు, కలసపాడులో ప్రచారంలో పాల్గొన్న బొజ్జ రోశన్న